

మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

శ్రమ తోడైతే.. గెలుపు నీదే..

● ఆ అధికారుల స్ఫూర్తితో ఐఏఎస్ సాధన

న్యూస్‌టుడే, మంచిర్యాల పట్టణం:

పట్టుదలతో సాధన చేస్తే ఏదైనా సాధించగలం.. మంచి ఆలోచనలతో పనిచేసే అధికారులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్తే అనుకున్న లక్ష్యాలను చేరుకోగలమని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. 'జవహర్ నవోదయలో చదువుతున్న సమయంలో పాఠశాల ప్రిన్సిపల్‌గా ఉన్న అప్పటి కలెక్టర్ సర్దార్ శ్యాంలాల్ విద్యార్థులకు కృషి చేశారు. బిహార్‌లో కలెక్టర్‌గా పనిచేసిన కె.కె.పాఠక్ అవినీతిని నిర్మూలించి, పరిపాలన విభాగాలను గాడిలో పెట్టారు. ఆ అధికారులను స్ఫూర్తిగా తీసుకుని ఐఏఎస్ కావాలనే లక్ష్యాన్ని ఏర్పరుచుకున్నా. అందుకు తగినట్లుగా సాధన చేశా. శ్రమతోడైతే నాలుగో ప్రయత్నంలో ఐఏఎస్ సాధించాను. ప్రస్తుతం మంచిర్యాల జిల్లా కలెక్టర్‌గా సేవలు అందిస్తున్నా.' విజయ ప్రస్థానం గురించి ఆయన మాటల్లోనే..

సర్కారు బడిలోనే చదువు

మాది సమస్తీపూర్ జిల్లాలోని దరహర మండలం బిరిజ్‌పూర్ గ్రామం. చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యాభ్యాసం సాగింది. ఒకటి నుంచి 5వ తరగతి వరకు స్వగ్రామంలో.. తర్వాత సమస్తీపూర్ జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివా. ఝార్ఖండ్‌లోని ధన్‌బాద్ ఐఐటీ పూర్తి చేశా. అనంతరం ఓఎన్‌జీసీలో ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం చేస్తూనే ఐఏఎస్ కోసం సాధన చేశా.

20 గుంటల స్థలం మాత్రమే ఉంది

నాన్న విశ్రాంత ఉపాధ్యాయుడు మనోజ్ కుమార్ సింగ్, తల్లి పుష్పకుమారి గృహిణి. అన్నయ్య ప్రభాత్ ప్రైవేటు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. నాన్నకు 1982లో ఉపాధ్యాయుడిగా ఎంపికైన జాబితాలో పేరు వచ్చింది. అప్పుడు ఆ ఉద్యోగం ఆయనకు ఇవ్వకుండా తక్కువ మార్కులు ఉన్న వ్యక్తికి ఇచ్చారు. న్యాయస్థానంలో కేసు వేసి గెలవడంతో 2012లో నాన్నకు ఉద్యోగం వచ్చింది. అందుకే తొమ్మిదేళ్లకే ఉద్యోగ విరమణ పొందాల్సి వచ్చింది. మాకు కేవలం 20 గుంటల స్థలం మాత్రమే ఉంది.

ఉద్యోగం చేస్తూనే సన్నద్ధమయ్యా

ఐఐటీలో మూడో సంవత్సరంలో ప్రభుత్వ కొలువు వచ్చింది. చదువు పూర్తయిన తర్వాత డెహ్రాడూన్‌లో ఓఎన్‌జీసీ ప్రభుత్వ ఉద్యోగం చేశా. ఆ సమయంలో ఐఏఎస్‌కు సన్నద్ధమయ్యా. రెండుసార్లు రాత పరీక్షలో ఎంపికై ఇంటర్వ్యూలో విఫలమయ్యా. మూడోసారి ప్రయత్నంలో ఐఆర్ఎస్ (ఇండియన్ రెవెన్యూ సర్వీస్)కు ఎంపికై ఇన్‌కం ట్యాక్స్ విభాగంలో పని చేశా. నాలుగో ప్రయత్నంలో ఐఏఎస్‌కు ఎంపికయ్యా. 2018 బ్యాచ్‌కి చెందిన నేను మంచిర్యాల జిల్లాలో శిక్షణ కలెక్టర్‌గా.. తర్వాత పెద్దపల్లి జిల్లాలో అదనపు కలెక్టర్‌గా మూడేళ్లు పని చేశా. అక్కడ పని చేస్తున్న సమయంలో కుటుంబ పెద్దలు స్వస్తికతో వివాహం జరిపించారు. ఆమె గైనకాలజిస్ట్‌గా పని చేస్తున్నారు. తర్వాత నాగర్‌కర్నూల్ జిల్లాలో అదనపు కలెక్టర్‌గా.. అక్కడి నుంచి ఇటీవల పదోన్నతిపై మంచిర్యాల జిల్లాకు కలెక్టర్‌గా వచ్చా.

తెలంగాణ వంటకాలంటే చాలా ఇష్టం

తెలంగాణలో నాన్‌వెజ్ వంటకాలు అంటే చాలా ఇష్టం. ఇక్కడ మటన్, చికెన్ వంటకాలు ఎక్కడా లేని విధంగా రుచిగా తయారు చేస్తారు. క్రికెట్, టేబుల్ టెన్నిస్ అంటే ఇష్టం. క్రికెట్ ఆడను కానీ చూస్తా. టెన్నిస్ మాత్రం ఇంట్లోనే ఆడతా.

లక్ష్యంతో చదవాలి

మనం చదువుకోవడానికి ప్రభుత్వం ఎంతో సహకారం అందిస్తోంది. యువత ప్రభుత్వ ఫలాలను ఉపయోగించుకుని అన్ని రంగాల్లో దూసుకెళ్లాలి. చెడు అలవాట్లకు దూరంగా ఉండి లక్ష్యంతో చదివితే అనుకున్నది సాధిస్తారు.

ఆదమరిస్తే.. జీవితం తారుమారే!



ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఏజెన్సీ ప్రాంతాల్లో వాగులపై ఏర్పాటు చేసిన వంతెనల వద్ద తారు రోడ్డు దెబ్బతిన్నాయి. ఉట్నూరు నుంచి దొంగచింతకు వెళ్లే రోడ్డు వాగుపై నిర్మించిన వంతెన వద్ద రోడ్డు కోతకు గురైంది. రాత్రి వేళల్లో వాహనదారులు వేగంగా వచ్చి గుంతలో పడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి కోతకు గురైన ప్రాంతంలో మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఉట్నూరు గ్రామీణం**

అవగాహనే ముఖ్యం.. సాధనతో పదిలం



న్యూస్‌టుడే, దండేపల్లి :

విద్యార్థి ఉన్నత చదువులకు తొలిమెట్టు పదో తరగతి. మంచి జీపీఏ సాధించడంతో పాటు విషయ అవగాహనపై పట్టు పెంచుకుంటే ఇంటర్‌తో పాటు వివిధ సాంకేతిక కోర్సుల్లో చేరి ఉన్నత చదువులు అభ్యసించే అవకాశం ఉంది. మార్చిలో పరీక్షలు ఉండటంతో సమయాన్ని వృథా చేయకుండా అడిగిన ప్రశ్నలకు సమాధానాలు రాయాలంటే ఏవిధంగా సాధన చేయాలి.. జీపీఏ పెరగాలంటే ఏయే అంశాలపై పట్టు సాధించాలో తెలుసుకుని అందుకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా ఇప్పటి నుంచే ముందుకు సాగితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారు. ఈ నేపథ్యంలో గణితం, భౌతిక రసాయన, సాంఘిక, జీవశాస్త్ర ఉపాధ్యాయులు అందజేస్తున్న సూచనలు ఇలా...

సూత్రాలు.. గ్రాఫ్‌లు విజయానికి దోహదం



- గణితంలో సూత్రాలు, గ్రాఫ్‌ల నిర్మాణం మార్కులకు దోహద పడతాయి.
- బహుపదులు, సాంఖ్యక శాస్త్రం, రేఖీయ సమీకరణాలు, వర్గ సమీకరణాల నుంచి ఒక గ్రాఫ్ అడుగుతారు.
- సాంఖ్యక శాస్త్రంలో ఓజీ వక్రం, సమితుల్లో వెన్‌చిత్రాలు సాధన చేయాలి.
- త్రికోణమితిలో అనువర్తనాల నుంచి లెక్కలు అడుగుతారు. ఇందులోని కోణ విలువలు, సూత్రాలు చాలా ముఖ్యం.
- వాస్తవ సంఖ్యలు, సంభావ్యత, సమితులు, త్రికోణమితి, క్షేత్రమితి, నిరూపక జ్యామితి, శ్రేఢులు అధ్యాయాలను బాగా సాధన చేస్తే మంచి మార్కులు వస్తాయి.

-మిట్టపల్లి సంతోష్‌కుమార్, గణిత ఉపాధ్యాయుడు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఖానాపూర్, ఆదిలాబాద్ జిల్లా

సమకాలీన అంశాలే కొలమానం



- పేరాగ్రాఫ్ ఇచ్చి విశ్లేషించడం, వ్యాఖ్యానించడం ద్వారా ఆరు మార్కులు వస్తాయి. పట్టిక ఇచ్చి దీనిలోని దత్తాంశాలను విశ్లేషించడం ద్వారా ఆరు మార్కులు సాధించవచ్చు.
- జనాభా, అక్షరాస్యత, దేశ సమగ్రత, గ్లోబల్ వార్మింగ్, హరిత హారం ఇలా అడిగే వ్యాసాలు రాసే తీరును తెలుసుకోవాలి.
- పటం, సమాచార నైపుణ్యాలు, వ్యాఖ్యానం, ప్రశంస, సమకాలీన అంశాలపై శ్రద్ధ చూపాలి.
- భారతదేశ భౌగోళిక స్వరూపం, ఉత్పత్తి ఉపాధి, నదులు, నీటి వనరులు, ఆహారభద్రత, సుస్థిర అభివృద్ధి, దేశ విభజన, స్వాతంత్ర్య ఉద్యమం, తెలంగాణ సాధన ఉద్యమ పాఠ్యాంశాలపై సాధన చేయాలి.
- జవాబులు పాయింట్ల వారీగా రాస్తే మంచి మార్కులు వస్తాయి...

-జి.రవిశంకర్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు, గంగారాం పాఠశాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా

ప్రయోగాలే ప్రధానం...



- ప్రయోగాలనుంచి ఒకటి అడుగుతారు.. ఇందులో ఉద్దేశం, పరికరాలు, ప్రయోగ విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫలితాన్ని కచ్చితంగా సాధన చేయాలి. చక్కగా పటాలు గీసి భాగాలు గుర్తించాలి.
- సమస్యల సాధనకు సూత్రాలను గుర్తుంచుకోవాలి.
- పట్టికల విశ్లేషణ, బొమ్మలు, భేదాలు, ఉదాహరణలు, పోలికలు, పటాలలో తప్పులు సవరించడం తదితర అంశాలను గుర్తుంచుకోవాలి.
- సమీకరణాలను తుల్యం చేయటం, దర్పణాలలో, కటకాలలో ఏర్పడు ప్రతిబింబాలు, వీటి కిరణ చిత్రాలు, నిజజీవితంలో వీటి ఉపయోగాలు, ఓమ్ నియమం, నిరోధాల శ్రేణులు, విద్యుత్తు ప్రవాహంపై సాధన చేయాలి. నవీన ఆవర్తన పట్టిక, పరమాణు నిర్మాణం, క్వాంటమ్ సంఖ్యలు, ఆర్బిటాళ్ల ఆకృతులను అవగాహన చేసుకుంటే మంచి మార్కులు వస్తాయి.

-గోలి రాజగోపాల్, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు, పొన్కల్ పాఠశాల, నిర్మల్ జిల్లా

పటాలు... పట్టికలను పట్టుబడితే చాలు..



- పటాల భాగాలు గుర్తించేటప్పుడు అన్ని ఒకవైపే రాయాలి.
- ప్రతీ పాఠంలో ఫ్లో చార్టు, భేదాలు, ప్రయోగశాల కృత్యాలు చేస్తే 10 మార్కులు వస్తాయి.
- కిరణజన్య సంయోగ క్రియ-శ్వాసక్రియ, అవాయుశ్వాసక్రియ-వాయుశ్వాసక్రియ, రక్తప్రసరణ, విసర్జన, లైంగిక ప్రత్యుత్పత్తి-అలైంగిక ప్రత్యుత్పత్తి, అనువంశికత, లింగ నిర్ధారణ, పోషకాహార లోపంతో కలిగే వ్యాధులు, నెఫ్రాన్ వ్యవస్థ అంశాలను చదివితే మంచి గ్రేడు సాధించవచ్చు.
- నేర్చుకున్న అంశాలను నిజ జీవితానికి అన్వయించే ప్రశ్నలు అడుగుతారు. వీటిని సాధన చేయాలి.

-గంప రవీందర్, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు, దండేపల్లి పాఠశాల, మంచిర్యాల జిల్లా

రహదారిపైనే వాహనం.. ఆదమరిస్తే ప్రమాదం



గుడిహత్నూర్ వద్ద జాతీయ రహదారిపైనే నిలిపిన లారీ

ఈ లారీని తెలుపు గీత పైనే నిలిపారు. వెనుక వస్తున్న వాహనదారులు ఈ లారీని చూసి వెళ్తుందనుకొని వేగంగా వస్తుంటారు. దగ్గరకు వచ్చే సరికి ఈ లారీ కదలదని తెలుసుకునేలోపే ఢీకొని ప్రమాదానికి గురవుతారు. ఇటీవల జాతీయ రహదారిపై ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొని జరుగుతున్న ప్రమాదాల కంటే రహదారులపైనే నిలిపి ఉన్న వాహనాలను ఢీకొన్నవి అధికంగా ఉన్నాయి.

- ఈనాడు, ఆదిలాబాద్

బల్దియా స్థలానికి బేరం

● నకిలీ పట్టా సృష్టించి విక్రయించేందుకు యత్నం

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ అర్బన్ :

జిల్లా కేంద్రంలో కబ్జారాయుళ్లకు హద్దూ అదుపు లేకుండా పోతోంది. స్థలమేదైనా ఖాళీగా కనిపిస్తే చాలు నకిలీ పత్రాలు సృష్టించి కబ్జాకు తెగపడుతున్నారు. బల్దియాలో అక్రమంగా అసెస్‌మెంట్, ఇంటి నెంబర్ తీసుకుని విక్రయించేందుకు యత్నిస్తున్నారు. ఇదే క్రమంలో ఓ వ్యక్తి రూ.10 కోట్ల విలువైన బల్దియా పార్కు స్థలాన్ని విక్రయించేందుకు బేరమాడి దొరికిపోవడం చర్చనీయాంశంగా మారింది.

1983లో పొందినట్లు నకిలీ పట్టా

జిల్లా కేంద్రం నడిబొడ్డున ఉన్న 49వ వార్డు(భుక్తాపూర్)లో బల్దియాకు సుమారు 8 వేల చదరపు అడుగుల లీజు స్థలం ఉంది. లీజు గడువు ముగియడంతో బల్దియా ఆధీనంలోకి వచ్చింది. కొన్ని సంవత్సరాలుగా ఖాళీగా ఉండటంతో 2021లో బల్దియా యంత్రాంగం అక్కడ పార్కును ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రూ.20 లక్షలు కేటాయించినా అవి విడుదల కావడం లేదని గుత్తేదారు పనులు చేయలేదు. ఖాళీగా ఉన్న ఆ స్థలంపై కబ్జాదారు కన్ను పడింది. 1983 సంవత్సరంలో రంగినేని లక్ష్మణ్‌రావు పురపాలక అధ్యక్షుడిగా ఉన్న సమయంలో 6 వేల చదరపు అడుగుల స్థలానికి పట్టా పొందినట్లు నకిలీ కాగితం తయారు చేసుకున్నారు. గతేడాది అదే పట్టాతో బల్దియాలో అసెస్‌మెంట్, ఇంటి నెంబరు పొందారు.

బండారం బయట పడిందిలా..

కబ్జాదారు ఆ స్థలాన్ని విక్రయించేందుకు ఓ మధ్యవర్తి సాయాన్ని తీసుకున్నారు. ఆ మధ్యవర్తి ఇటీవల నకిలీ పత్రాలు తీసుకుని ఆ స్థలం పక్కనే ఆసుపత్రి ఉన్న ఓ వైద్యుడిని సంప్రదించారు. రూ.10 కోట్లకు బేరమాడారు. అనుమానం వచ్చిన ఆ వైద్యుడు స్థానిక కౌన్సిలర్ వెనుగంటి ప్రకాశ్‌కు నకిలీ పత్రాలను పంపించి ఆరా తీశారు. కౌన్సిలర్ ఆ పత్రాలతో బల్దియా కార్యాలయంలో విచారించారు. అదే పట్టా నెంబరుతో వేరే లబ్ధిదారు పేరుతో వేరేచోట స్థలం ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. పట్టా నకిలీదని నిర్ధారణ చేసుకున్న కౌన్సిలర్ అక్రమాలకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని పురపాలక కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.



భుక్తాపూర్‌లో పార్కు ఏర్పాటుకు కేటాయించిన బల్దియా లీజు స్థలం

విచారణ చేస్తున్నాం

- ఎండీ ఖమర్ అహ్మద్, బల్దియా కమిషనర్

పట్టణంలోని 49వ వార్డులో పార్కు స్థలంపై నకిలీ పట్టా పొంది, అసెస్‌మెంట్ చేశారని ఫిర్యాదు వచ్చింది. పార్కు స్థలానికి పట్టా ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు అసెస్‌మెంట్ చేశారు అనే అంశాలపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

ఆగిన కసరత్తు



జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో రెండేళ్ల కిందట పట్టణ ప్రగతిలో భాగంగా రూ.1.95 కోట్లతో అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. పనులు సైతం వేగవంతం చేశారు. అత్యాధునిక వ్యాయామ పరికరాలు(మల్టీ జిమ్) అందుబాటులోకి వస్తాయని, కసరత్తు చేయొచ్చని పట్టణవాసులు, క్రీడాకారులు ఎంతో ఆశించారు. పునాదులు, పిల్లర్ల వరకు నిర్మించిన సదరు గుత్తేదారు బిల్లులు రాకపోవడంతో వాటి నిర్మాణాన్ని అర్ధాంతరంగా ఆపివేశారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే జిమ్ నిర్మాణ పనులను ప్రారంభించాలని సాధకులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ఆదిలాబాద్ క్రీడావిభాగం



ఐటీఐలో సమావేశమైన ఐఎంసీ కమిటీ సభ్యులు

పాలనాధికారి చొరవ.. బోధన చేరువ



పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో మూకుమ్మడి సెలవు పెట్టిన బోధకులు విధుల్లో చేరారు. సివిల్ విభాగంలో బోధకుల నియామకం, బకాయి వేతనాల చెల్లింపు, సౌకర్యాల కల్పనకు అవసరమైన చర్యలు ప్రారంభమయ్యాయి. 'బోధకుల సెలవు.. బోధన కరవు' శీర్షికన 'ఈనాడు'లో ఈనెల 26న ఐటీఐ విద్యార్థుల ఇబ్బందులపై కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. స్పందించిన పాలనాధికారి రాజర్షిషా అదే రోజున ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఆర్.శ్రీనివాస్‌ను పిలిపించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శనివారం ఐఎంసీ(ఇండస్ట్రియల్ మేనేజ్‌మెంట్ కమిటీ) సమావేశమైంది. ఈ భేటీలో ఆర్‌డీడీ సీతారాములు వర్చువల్‌గా సమావేశంలో పాల్గొనగా.. కమిటీ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపల్ శ్రీనివాస్, సభ్యులు సుమిత్ర, విద్యార్థి అబ్దుల్లా పాల్గొన్నారు. మూకుమ్మడి సెలవులో ఉన్న అధ్యాపకులు విధుల్లో చేరగా.. ఎలక్ట్రీషియన్ ట్రేడ్ విద్యార్థుల బోధనకు ఉట్నూరు ఐటీఐ బోధకుడిని డిప్యూటేషన్‌పై ఇక్కడకు రప్పించారు. ఐఎంసీలో అందుబాటులో ఉన్న నిధుల వినియోగానికి ఆమోదం తెలపాలని, నూతన బోధకుడి నియామకానికి నోటిఫికేషన్ భర్తీ చేయాలని తీర్మానించారు. సౌకర్యాలు, సామగ్రి కల్పనకు ప్రతిపాదనలు తయారు చేసి నివేదిక ఇవ్వాలని పాలనాధికారి ఆదేశించడంతో తమ సమస్యలు దూరం కానున్నాయనే అభిప్రాయం విద్యార్థుల్లో వ్యక్తమవుతోంది.

పంట మునిగింది.. నష్టం తేలింది

● 8 మండలాల్లో 3,096 ఎకరాలు వర్షార్పణం..



భారీ వర్షాలతో దెబ్బతిన్న గోబి పంట

బేల మండలం బెదోడకు చెందిన బి.దాదారావుకు ఉన్న రెండున్నర ఎకరాల మిరప పంట నీట మునిగిపోయింది. వరద నీరు తగ్గిన తర్వాత పంట పొలంలో ఒక మొక్క కూడా కనబడకుండా ఇసుక మేటలు వేసింది. మొక్కలను తొలగించి, నేలను తిరిగి దున్నేసి వేరే పంట సాగు చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.






గుడిహత్నూర్ మండలం టాకిగూడకు చెందిన ఈ రైతు పేరు ప్రశాంత్. మూడెకరాల్లో గోబి సాగు చేశాడు. వరుస వర్షాలతో గోబి పంట మొత్తం దెబ్బతింది. తిరిగి వాటిని కోసి, విక్రయించే పరిస్థితి లేకపోవడంతో పంటను తొలగించి, తిరిగి యాసంగిలో శనగ పంట సాగు చేస్తానని రైతు తెలిపారు.

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం, బోథ్

జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో పంటలు నీట మునిగి, ఇసుక మేటలు వేసి అన్నదాతలు నష్టపోయారు. పలు గ్రామాల్లో రైతుల వారీగా జరిగిన పంట నష్టంపై అధికారులు పూర్తి స్థాయి సర్వే చేశారు. నివేదికను ప్రభుత్వానికి పంపించారు. జిల్లాలో 2,041 మంది రైతులకు చెందిన 3,096 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగినట్లుగా తేల్చారు. గ్రామాల వారీగా క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి నష్టాలపై నివేదికను రూపొందించినట్లు జిల్లా సాంకేతిక అధికారి శివకుమార్ తెలిపారు. పెన్‌గంగ తీర ప్రాంతంలో ఉండే బేల, భీంపూర్, జైనథ్ తదితర మండలాల్లో నష్ట తీవ్రత ఎక్కువగా ఉంది. ఉట్నూరు, ఇచ్చోడ, సిరికొండ, తలమడుగు, ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లో వరుస వర్షాలతో వాగులు ఉద్ధృతంగా ప్రవహించి పంట పొలాలు నీట మునిగాయి.



సాయం కోసం ఎదురుచూపులు..

ప్రాథమిక నివేదిక మేరకు ఆయా మండలాల్లో నీట మునిగి, పూర్తి స్థాయిలో నష్టపోయిన రైతుల వివరాలను అధికారులు సేకరించి నివేదిక రూపొందించి ప్రభుత్వానికి పంపించారు. అత్యధికంగా 2,475 ఎకరాల్లో పత్తి, తర్వాత సోయా 371 ఎకరాల్లో మునిగిపోయింది. రైతులు మొక్కలు తీసేసి, తిరిగి జొన్న, ఇతర పంటలు సాగు చేశారు. ఉట్నూరు, బేల, జైనథ్ మండలాల్లో ఎక్కువ నష్టం జరిగింది. నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ప్రభుత్వం ప్రకటించడంతో సాయం కోసం అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

బాధిత మహిళలకు భరోసానివ్వాలి



సఖీ కేంద్రంలో రికార్డులను తనిఖీ చేస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద

ఎదులాపురం, న్యూస్‌టుడే : న్యాయం కోసం సఖీ కేంద్రాన్ని ఆశ్రయించే బాధిత మహిళలకు న్యాయం జరుగుతుందన్న భరోసా కల్పించాలని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద సూచించారు. ఆదిలాబాద్ సఖీ కేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించి తనిఖీ చేశారు. కేంద్రంలోని రికార్డులను పరిశీలించి సిబ్బంది పని తీరును సమీక్షించారు. కేసుల వివరాలను కేంద్రం నిర్వాహకురాలు సరస్వతిని అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై ఫిర్యాదులు చేయడానికి అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో, కూడళ్లలో టోల్ ఫ్రీ నెంబర్లు(94905 55533, 181, 1098, 14567) ప్రదర్శించాలని సూచించారు. సభ్యురాలు ఈశ్వరీబాయి, కార్యదర్శి సుభద్ర, డీడబ్ల్యూఓ ఎం.సబిత, తదితరులున్నారు.

ఆదిలాబాద్ అర్బన్ : సమాజంలో మహిళలను చూసే విధానం మారాలని, తల్లిదండ్రులు పిల్లలకు చిన్నప్పటి నుంచే మహిళలను గౌరవించే సంస్కృతిని నేర్పాలని రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పెన్‌గంగ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యాసంస్థల్లో యువతులు ఒత్తిడి కారణంగా కుంగుబాటుకు గురికాకుండా ఆన్‌లైన్‌లో వారికి కౌన్సెలింగ్ ఏర్పాటు చేసేలా యాప్ తీసుకువస్తామన్నారు.



గుండె లయతప్పి

రక్తం పోటెత్తి..

- పెరుగుతున్న బాధితులు
- నేడు 'ప్రపంచ హృదయ దినోత్సవం'

2024 నినాదం 'యూజ్ హార్ట్ ఫర్ యాక్షన్'. 2025 నాటికి గుండె జబ్బు మరణాలను కనీసం 25 శాతం తగ్గించాలనే ఉద్దేశంతో ఈ విషయంలో తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలను విస్తృతంగా ప్రచారం చేయటానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ ఏడాది ఇచ్చిన నినాదం ఇది.

గుండె పోటు లక్షణాలు ఇవీ..

- ఏ మాత్రం నడిచినా ఆయాసం రావటం
- ఊపిరి తీసుకోవటంలో ఇబ్బందులు
- కాళ్ల వాపులు
- ఛాతిలో నొప్పి వచ్చి వీపు వైపు పాకటం
- ఏ పని చేసినా తొందరగా అలసి పోవటం
- గుండె కొట్టుకునే వేగం పెరగటం

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వైద్య విభాగం

ప్రస్తుత జీవన విధానం, మానసిక ఒత్తిడి, మారిన ఆహారపు అలవాట్లతో ఉమ్మడి జిల్లాలో గుండె సంబంధిత వ్యాధుల బారిన పడే వారి సంఖ్య పెరిగిపోతోంది. ప్రధానంగా మానసిక ఒత్తిడి కారణంగా రక్తపోటు(బీపీ) పెరిగి గుండె లయతప్పి మృత్యువాత పడుతున్న బాధితులు పెరిగిపోతున్నారు. బీపీ బారిన పడ్డ వారికి మధుమేహం, థైరాయిడ్ సమస్యలు ఏర్పడి అవి గుండెపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి. ఇది వరకు వృద్ధుల్లో అక్కడక్కడ మాత్రమే అరుదుగా కనిపించేవారు. ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా గుండె జబ్బుల బారిన పడుతున్నారు. రక్తపోటు వంశ పారంపర్యంగా కూడా వచ్చే అవకాశాలున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. బీపీ బారిన పడ్డ వారు మధుమేహం, థైరాయిడ్‌కు గురయ్యే అవకాశాలుంటాయంటున్నారు. యుక్త వయస్కుల్లో సాధారణ బీపీ 120(సిస్టోలిక్), 80(డయాస్టోలిక్) ఉండాలి. రక్తపోటు వచ్చిన వారికి గుండె జబ్బుల ముప్పు పొంచి ఉందంటున్నారు.

తల్లి గర్భంలో నెలల శిశువుగా ఉన్నప్పుడే గుండె స్పందన ప్రారంభమై మనిషి మృతి చెందే వరకు రెప్పపాటు కాలం కూడా ఆగకుండా పని చేస్తుంది. కేవలం కొన్ని నిమిషాలు గుండె పని చేయటం మానేస్తే జీవితం అంతం అయిపోతుంది. అందుకే గుండెను ఆరోగ్యంగా కాపాడుకుంటేనే జీవించి ఉండగలుగుతాం. ప్రజలంతా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో ఏటా సెప్టెంబరు 29న 'ప్రపంచ హృదయ దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 1.87 లక్షల మంది బాధితులు

జిల్లా	రక్తపోటు బాధితులు
ఆదిలాబాద్	32,995
నిర్మల్	75,563
కుమురం భీం	19,003
మంచిర్యాల	60,071

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవి..

- అనునిత్యం శారీరక శ్రమ ఉండాలి, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి
- అధిక పోషకాహారం (ఆకుకూరలు, కూరగాయలు) తీసుకోవాలి.
- నూనె పదార్థాలు, జంక్ ఫుడ్‌లకు దూరంగా ఉండటం మంచిది
- ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉండటానికి ప్రయత్నించాలి
- ఉప్పు అధికంగా వాడొద్దు
- రోజూ 8 గంటలు ప్రశాంతంగా నిద్రపోవాలి.
- ఏదైనా తీవ్ర ఒత్తిడికి గురైతే ఉపశమనం కోసం క్రీడలు, ఇతర వ్యాపకాలపై దృష్టి సారించాలి

లక్షణాలుంటే వైద్యుడిని సంప్రదించాలి

- కస్తూరి శ్రీనివాస్, జనరల్ ఫిజీషియన్, రిమ్స్



గుండె సంబంధిత వ్యాధులు, బీపీ లక్షణాలు ఏమాత్రం ఉన్నా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. వైద్యుల సూచనలు పాటిస్తూ క్రమం తప్పకుండా నిర్ణీత సమయంలో మందులు వాడాల్సి ఉంటుంది. లేకుంటే ప్రాణాలకే ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంటుంది. రోజూ కాసేపు వ్యాయామం చేస్తే వీటి ముప్పును చాలా వరకు తగ్గించుకోవచ్చు.

ఇబ్బందులను నిర్లక్ష్యం చేయొద్దు

- రాజేష్, గుండె వైద్యనిపుణులు, మంచిర్యాల



ఛాతిపై ఒత్తిడి, అసౌకర్యం, కాళ్లు, చేతుల్లో నొప్పులు, అలసట, చెమటలు పట్టడం, తల తిరగడం, వేగంగా గుండె కొట్టుకోవడం ఇలా ఎలాంటి ఇబ్బందులు కలిగినా వెంటనే సంబంధిత వైద్యుడిని సంప్రదించడం అవసరం. వీటిని ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా పరిణామాలు తీవ్రంగా ఉండటమే కాకుండా ప్రాణహాని ఉండే అవకాశం ఉంది. ఏ చిన్న ఇబ్బంది తలెత్తినా అశ్రద్ధ చేయవద్దు. జీవనశైలి, ఆహార అలవాట్లు ఆరోగ్యకరంగా ఉంచుకోవాలి.

ఎరుపెక్కిన అంబరం.. చూపరులకు సంబరం



కారుమబ్బులు చీల్చుకుంటూ సూర్యోదయం వేళ భానుడి అరుణ కిరణాలతో ఆకాశం ఎరుపెక్కింది. మబ్బులన్నీ ఎరుపు వర్ణాన్ని సంతరించుకొన్న అంబరం చూపరులకు కనువిందు చేసింది. ఈ దృశ్యం కనిపించింది. మెల్లమెల్లగా సూర్యుడు బయటకు రావడంతో ఆకాశం ఎరుపు వర్ణాన్ని వీడి నీలం రంగులోకి మారింది. నింగిలో ఈ సుందర దృశ్యం ఖానాపూర్, భైంసా మండలం ఇలేగాం, తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 5:30 తర్వాత ఆవిష్కృతమైంది. తెల్లవారంతోనే ప్రజలకు కనువిందు చేసింది.

- ఖానాపూర్, భైంసా, న్యూస్‌టుడే

నరభక్షక పులి చేజిక్కే..



స్పృహ కోల్పోయిన టి-83 పులి వద్ద అటవీ అధికారులు

బల్లార్ష, న్యూస్‌టుడే : మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా మూల్ తాలూకా చిచపల్లి అటవీక్షేత్రంలో నలుగురిని హతమార్చిన టి-83 అనే పులిని శనివారం అటవీశాఖ అధికారులు బంధించారు. జనాలా, కాంతాపేట్, చిరోలీ, కర్ టోపే, చింతాల తదితర గ్రామ పరిసరాల అడవుల్లో సంచరిస్తూ పదిహేను రోజుల్లో నలుగురు పశువుల కాపరుల ప్రాణాలు తీసింది. దీంతో స్థానికుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. రాష్ట్ర అటవీశాఖ మంత్రి మునగంటివార్ ఇటీవల పులిని వెంటనే పట్టుకోవాలని ఆదేశాలు జారీచేశారు. ఈక్రమంలో అధికారులు అడవిలో పలుచోట్ల బోన్లు ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు అమర్చారు. ఈ ప్రయత్నాలు విఫలం కావడంతో డ్రోన్ సాయంతో శనివారం జనాడా గ్రామ పరిసర అడవుల్లో సంచరిస్తోందని గుర్తించారు. ప్రముఖ షూటర్ అజయ్ మరాఠే సాయంతో పులికి మత్తుమందు ఇచ్చి స్పృహ కోల్పోయేలా చేశారు. అభయారణ్యాల పశువైద్యాధికారి రవికాంత్ దేశ్‌పాండే పరిశీలించిన తర్వాత దాన్ని చంద్రపూర్ కేర్ సెంటర్‌కు తరలించారు.

పుస్తకాల కింద పాము..



కౌటాల, న్యూస్‌టుడే : కౌటాల మండలంలోని కన్నెపెల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం పాము కలకలం సృష్టించింది. ఉదయం వచ్చిన విద్యార్థులు తరగతి గదిలో కూర్చొని ఉండగా పుస్తకాల కింద పాము ఉండడంతో ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఉపాధ్యాయులు వెంటనే స్పందించడంతో స్థానికుల సహాయంతో దాన్ని చంపారు. ప్రహరీ గోడ లేకపోవడంతో తరచూ బడి ఆవరణలోకి విషపురుగులు వస్తున్నాయని ప్రధానోపాధ్యాయురాలు అనూష తెలిపారు.

తిరుపతి ఘటనపై న్యాయవిచారణ జరపాలి : వీహెచ్‌పీ

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: తిరుపతిలో లడ్డూ ప్రసాదంలో కల్తీ ఘటనపై సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని విశ్వహిందూపరిషత్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ విఠల్ డిమాండ్ చేశారు. నిర్మల్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కలియుగదైవంగా భక్తులు పూజించే ఆలయంలో అపవిత్రత చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. దేవాదాయశాఖను రద్దుచేసి, ధార్మిక వ్యక్తులకు నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని సూచించారు. ఈ డిమాండ్ల సాధనకు ఈనెల 30న నిర్మల్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందూరు విభాగ్ ధర్మాచార్య సంపర్క్ ప్రముఖ్ పతికె రాజేందర్, జిల్లా కార్యదర్శి మూర్తి ప్రభాకర్, సాదం ఆనంద్, పతికె రమేశ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకుంటే కిడ్నీలు అమర్చుతాం

ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే : డయాలసిస్ బాధితులు దరఖాస్తులు చేసుకుంటే లభ్యతను బట్టి ఉచితంగా నిమ్స్ ఆసుపత్రిలో కిడ్నీలను జీవన్‌దాన్‌లో భాగంగా అమర్చే ఏర్పాటు చేస్తామని హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రి నెఫ్రాలజిస్ట్ వైద్యుడు కార్తిక్ పేర్కొన్నారు. ఆయనతో పాటు నిమ్స్ మరో నెఫ్రాలజిస్ట్ శశాంక్‌లు రిమ్స్ డయాలసిస్ కేంద్రాన్ని శనివారం సందర్శించి పరిశీలించారు. జీవన్‌దాన్ గురించి అవగాహన కల్పించారు. రిమ్స్ సంచాలకుడు డాక్టర్ రాఠోడ్ జైసింగ్, అపెక్స్ క్వాలిటీ మేనేజర్ జీవన్, కేంద్రం బాధ్యుడు ప్రేందాస్ సిబ్బంది ఉన్నారు.



రిమ్స్‌లోని డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న నిమ్స్ ఆసుపత్రి వైద్యులు

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి





సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.



రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మరిన్ని వివరాలకు.. www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

మూడేళ్ల చిన్నారిపై అత్యాచారయత్నం

- నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ పట్టణంలోని ఒక కాలనీలో మూడేళ్ల చిన్నారిపై దాదాపు 45 సంవత్సరాల వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన శనివారం వెలుగు చూసింది. అదే కాలనీకి చెందిన నంద కుమార్ అనే వ్యక్తి మరుగుదొడ్డిలోకి తీసుకెళ్లి అత్యాచారయత్నం చేసినట్లు కుటుంబ సభ్యులు ఆదిలాబాద్ టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు చిన్నారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు.

సిమెంటు ఇటుకలతో..
మనసుదోచే శిల్పాలు

- విశ్రాంత ఉద్యోగి కళారాధన

ఈటీవీ - ఆదిలాబాద్ :

అయోధ్యలో కొలువుదీరిన రాంలల్లా. శాంతిని ప్రబోధించే గౌతముడు. హంపినగర శిల్ప సౌందర్యం. కాకతీయ సామ్రాజ్య కళా వైభవం. అన్నీ ఒకే చోట కొలువైతే. ఎంత బాగుంటుంది. దాన్ని సుసాధ్యం చేశారో విశ్రాంత ఉద్యోగి. ఆరు పదుల వయసులో తనలో దాగి ఉన్న శిల్పకళను తట్టిలేపారు. మనసును మంత్రముగ్ధులను చేసే ఎన్నో కళాకృతులకు జీవం పోశారు. కళారాధనంటే వ్యాపార దృక్పథం కాదు. మనసును తేలిక పర్చుకోవడమనేలా సాగుతున్న శిల్ప కళా సౌందర్యంపై 'ఈటీవీ - ఈనాడు' ప్రత్యేక కథనం.



ప్రతిమలను చెక్కుతున్న కేవీరావు

ఆదిలాబాద్‌లోని జీఎస్ కాలనీలో నివాసం ఉండే కె.జ్యోతిశ్రీ-కేవీ రావు దంపతులది సాధారణ మధ్య తరగతి కుటుంబం. సిమెంటు పరిశ్రమ విశ్రాంత ఉద్యోగి అయిన కేవీరావుకు చిన్నప్పటి నుంచి కళలంటే అమితమైన ఆసక్తి. కరోనా సమయంలో తన కళా నైపుణ్యానికి పదును పెట్టారు. మార్కెట్లో లభించే సిమెంటు ఇటుకలను కొనుగోలు చేసి శిల్పాలుగా మలచడం ప్రారంభించారు. సుద్దముక్కలను శిల్పాలుగా తీర్చిదిద్దేందుకు యత్నించారు. ఎన్నోసార్లు విఫలయ్యారు. సుద్దముక్కలు, ఇటుకలు విరిగిపోయాయి. వినియోగించిన చిన్నపాటి ఉలి, రంపంతో చేతివేళ్లకు గాయాలయ్యాయి. అయినా పట్టువీడలేదు. ఆలోచనను విరమించుకోలేదు. ఎన్నో అబ్బురపరిచే కళాకృతులకు ప్రాణం పోశారు. చూపరులను మంత్రముగ్ధులను చేసే శిల్పాలను తీర్చిదిద్దారు. ఆయన ఇంట్లోని ఓ గది చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని తట్టిలేపే ఎన్నో శిల్పాలతో నిండిపోయి ఉందంటే ఆశ్చర్యం వేయకమానదు.

చిత్రం విచిత్రమే..

ఆరు అంగుళాల సుద్దముక్క నుంచి మొదలుకొని రెండు అడుగుల వరకున్న తేలికపాటి సిమెంటు ఇటుకలే ముడిసరకుగా బొమ్మలుగా చెక్కడంలో ఆయన దిట్ట. ఇటుకపై తయారు చేసిన బుద్ధుడి బొమ్మను చూస్తే హుస్సేన్‌సాగర్‌లో ఉన్న ప్రతిమ చిత్రంగా అనిపిస్తుంది. రెండు అంగులాల సుద్దముక్కపై చెక్కిన శివాజీ ముఖాన్ని చూస్తే చాలు ఆశ్చర్యం వేయకమానదు. దేవాలయాలు, చారిత్రక కట్టడాలు, నాట్యభంగిమలు, ఏనుగులు, గుర్రాలతో కూడిన శిల్ప సౌందర్యం, సింగపూర్ రాజముద్ర, గోడలకు అతికించేలా దేవతాప్రతిమలు, టీవీ స్టాండ్లు ఇలా ఎన్నో ఆకృతులకు ప్రాణం పోస్తున్నారు.

స్నేహితులకు, బంధువులకు బహుమతులుగా..

తయారు చేసిన శిల్పాల క్రయవిక్రయాలకు ప్రాధాన్యం ఇవ్వరు. వివాహాలు, ఇతర శుభ కార్యాల్లో బహుమతులుగా అందజేస్తారు. స్నేహితులకు బహుమానంగా ఇస్తారు. ఇటుకలు కొనిచ్చి తమకు కావాల్సిన ప్రతిమను తయారుచేయమని మిత్రులు అడిగితే ఉచితంగానే చేసి ఇస్తారు. నేను ఎంచుకున్న కళారాధన వ్యాపారం కోసం కాదు. మానసిక ఆనందం కోసమే. సతీమణి జ్యోతిశ్రీ ప్రోత్సాహంతోనే ఇది సాధ్యమైందని కేవీరావు చెబుతుంటారు.



తయారు చేసిన శిల్పాలతో కేవీరావు దంపతులు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఆదిలాబాద్: 90309 25238
ఇచ్చోడ: 94935 57309
బోథ్: 96031 04720
ఉట్నూరు: 94410 86640

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ అర్బన్

? ఆదిలాబాద్ పట్టణంలోని 12వ వార్డు రాంనగర్‌లో రామాలయం వెనకాల రెండో వీధిలో అంతర్గత రహదారులు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. **- కాకడే ప్రఫుల్, రాంనగర్**

✔ అంతర్గత రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. ఆమోదం లభిస్తే టెండరు పిలిచి పనులు చేపడతాం. **- తిరుపతి, డీఈఈ**

న్యూస్‌టుడే, ఇంద్రవెల్లి:

? మర్కాగూడ పంచాయతీ కేంద్రంలోని వ్యవసాయ పొలాలలో విద్యుత్తు తీగలు వేలాడుతున్నాయి. **- కాంబ్లె విలాస్, మర్కాగూడ**

✔ వేలాడుతున్న విద్యుత్తు తీగలను త్వరలోనే సరిచేస్తాం. **- జాదవ్ రోహిదాస్, ఏఈఈ, ఇంద్రవెల్లి**

న్యూస్‌టుడే, బేల:

? బేల మండలం సొంగిడిలో కులవృత్తుల వారు విశ్వకర్మ యోజన పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి లాగిన్ ద్వారా తమ దరఖాస్తులు అప్రూవల్ కాకపోవడంతో శిక్షణ పొందలేకపోతున్నాం. **- అనిల్, స్థానికుడు**

✔ జాప్యం ఎందుకు జరిగిందో పంచాయతీ కార్యదర్శితో మాట్లాడతా. ఆయన లాగిన్ ద్వారా దరఖాస్తులన్నీ అప్రూవల్ అయ్యేలా చర్యలు తీసుకుంటా. **- మహేందర్, ఎంపీడీఓ, బేల**

వందనం

విరిగిపడిన చెట్ల కొమ్మల తొలగింపు

తాంసి, న్యూస్‌టుడే: తాంసి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పక్కన రోడ్డుపై ఈదురుగాలులకు చెట్ల కొమ్మలు విరిగిపడి, రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ సమస్యపై ఈ నెల 26న 'ఈనాడు'లో 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన వార్త వచ్చింది. శనివారం పంచాయతీ కార్మికులు కొమ్మలను తీసి వేసి, రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు.



గుత్తేదారుతో మరమ్మతులు చేయిస్తాం

ఆదిలాబాద్ అర్బన్: బల్దియా డంపింగ్‌యార్డులో శిథిలమవుతున్న జంతు సంరక్షణ కేంద్రానికి సంబంధిత గుత్తేదారుతోనే మరమ్మతులు చేయిస్తామని పురపాలక కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్ పేర్కొన్నారు. ఈ నెల 25న ఈనాడులో 'రూ. 82 లక్షల ఖర్చు.. 18 నెలలకే పగుళ్లు' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో 'ఈనాడు' కథనాన్ని చూపిస్తూ పలువురు కౌన్సిలర్లు ప్రస్తావించారు.

పైపులైన్ లీకేజీకి మరమ్మతులు

బోథ్, న్యూస్‌టుడే : బోథ్‌లోని ప్రయాణప్రాంగణం వెనుకాల వీధిలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో నీరు వృథాగా పోతోంది. ఈ సమస్య మంగళవారం 'ఈనాడు'లో 'మేమున్నాం.. మీకు తోడుగా'లో ప్రచురితమైంది. స్పందించిన మిషన్ భగీరథ ఏఈ కళ్యాణ్ సిబ్బందితో కలిసి నీరు వృథాగా వెళ్లకుండా శనివారం పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు.



విద్యుదాఘాతంతో ఒకరికి గాయాలు

బేల, న్యూస్‌టుడే : ఏకోరి గ్రామంలో విద్యుదాఘాతంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గొర్ల విలాస్ శనివారం విద్యుత్తు నియంత్రిక వద్ద పనులు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్తు సరఫరా అయింది. విద్యుదాఘాతంతో కింద పడటంతో గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆదిలాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఆరుగురి బైండోవర్

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : ఇంద్రవెల్లి గ్రామ శివారులో జూదం ఆడిన ఆరుగురిని పోలీసులు తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేసినట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

సీఎంను దూషించిన ఒకరిపై కేసు

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : సీఎంను సామాజిక మాధ్యమాల్లో దూషించిన ఖానాపూర్‌కు చెందిన గంగన్న(60)పై ఆదిలాబాద్ టూటౌన్ పోలీసులు శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. ఆ పోస్టును సామాజిక మాధ్యమాల్లో పెట్టిన వారిపైనా కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : తిర్పల్లికి చెందిన ఎస్‌కే అజీం అహ్మద్ ద్విచక్ర వాహనం ఈ నెల 22 పెట్రోల్ బంక్ వద్ద పార్కింగ్ చేశాడు. 23న ఉదయం కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రూ.3.38 లక్షల వసూలు, జరిమానా

ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా శుక్రవారం నిర్వహించిన ప్రజా వేదికలో అక్రమ వసూళ్లు, అవకతవకలను అధికారులు గుర్తించారు. పంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక, క్షేత్ర సహాయకుల నుంచి రూ. 2.74 లక్షలను వసూలు చేయనున్నారు. రూ. 64 వేల నగదును జరిమానాగా విధించారు.

గంజాయి మొక్కలు స్వాధీనం

ఇచ్చోడ, న్యూస్‌టుడే : ఇచ్చోడ మండలంలో గంజాయి మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ భీమేష్ వివరాల ప్రకారం.. ఇచ్చోడ మండలం గుబ్బతండా శివారులోని భూమిని పెందూర్ మాణిక్యరావు కౌలుకు తీసుకొని పత్తి పంట సాగు చేస్తున్నాడు. గంజాయి సాగు చేస్తున్నాడన్న ముందస్తు సమాచారంతో సీఐ భీమేష్ సిబ్బంది తనిఖీ చేశారు. 30 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు రైతుభరోసా వెంటనే ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంకా రాఘవులు, పార్టీ సీనియర్ నాయకులు బండి దత్తాత్రిలు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని చాంద(టి) గ్రామంలో నిర్వహించిన గ్రామ శాఖ మహాసభలో మాట్లాడారు. సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. నాయకులు స్వామి, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.



విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకర్



ఆదిలాబాద్‌లో యువకులు

ఘనంగా భగత్‌సింగ్ జయంతి

పాలనాప్రాంగణం, ఆదిలాబాద్ అర్బన్, బోథ్, న్యూస్‌టుడే : భగత్‌సింగ్ జయంతి వేడుకలను పార్టీలు, విద్యార్థి సంఘాలు ఘనంగా నిర్వహించాయి. కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమీపంలోని విగ్రహం వద్ద ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో పాటు ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులు నివాళులు అర్పించారు.



బోథ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఏఐఎస్ఎఫ్ నాయకులు

సత్వర న్యాయానికి లోక్‌అదాలత్ మంచి వేదిక

ఎదులాపురం, న్యూస్‌టుడే : కక్షిదారులు సత్వర న్యాయం పొందటానికి జాతీయ లోక్ అదాలత్ మంచి వేదిక అని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న న్యాయస్థానాల్లో శనివారం జాతీయ లోక అదాలత్‌లను నిర్వహించి రాజీ మార్గం ద్వారా పలువురు కక్షిదారుల దావాలను పరిష్కరించారు. ఆదిలాబాద్ జిల్లా న్యాయస్థానాల ఆవరణలోని న్యాయ సేవా సదన్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభించారు. ఎస్పీ గౌష్ ఆలం మాట్లాడుతూ సైబర్ నేరాల బారిన పడ్డ బాధితులు వెంటనే పోలీసులను సంప్రదిస్తే సత్వర న్యాయం అందుతుందన్నారు. వీటికి సంబంధించి 42 కేసులను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. సైబర్ క్రైం బారిన పడి ఆర్థికంగా నష్టపోయిన ఇద్దరు బాధితులకు హోల్డ్ చేసిన నగదుకు చెందిన అవార్డులను అందజేశారు. న్యాయమూర్తులు పి. శివరాంప్రసాద్, ప్రమీలా జైన్, సూర్యవార్ మంజుల, దుర్గారాణి, హుస్సేన్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి బోనగిరి సౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, డీఎస్పీలు జీవన్‌రెడ్డి, పోతారం శ్రీనివాస్ పాల్గొన్నారు.



లోక్ అదాలత్ సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు

బోథ్, న్యూస్‌టుడే : లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం లభిస్తుందని బోథ్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి. హుస్సేన్ అన్నారు. బోథ్‌లోని జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. లోక్‌అదాలత్‌లో 172 కేసులు పరిష్కారమయ్యాయి. పీపీ శ్రీధర్, ఏజీపీ పంద్రం శంకర్, న్యాయవాదులు హరీశ్, రూపేందర్ సింగ్, దమ్మపాల్, విజయ్‌కుమార్, జమీర్, శరణ్య రెడ్డి, బ్యాంకు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



బోథ్ జూనియర్ సివిల్ కోర్టులో కక్షిదారులను విచారిస్తున్న జడ్జి బి.హుస్సేన్

2,810 కేసులు పరిష్కారం

ఆదిలాబాద్ నేర విభాగం: జిల్లా వ్యాప్తంగా వివిధ కోర్టుల్లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో రాత్రి ఎనిమిది గంటల వరకు 2,810 కేసులను పరిష్కరించారు. వీటిలో 29 సివిల్ కేసులు, 2,565 క్రిమినల్ కేసులు, 216 పీఎల్‌సీ కేసులున్నాయి. మొత్తంగా రాష్ట్రంలో కేసుల పరిష్కారంలో జిల్లా 26వ స్థానంలో నిలిచింది. పరిష్కారం అయిన కేసుల్లో సింహభాగం కేసులు పోలీసు శాఖవే ఉన్నాయి. వీటిలో 954 కేసుల పరిష్కారం ద్వారా రూ. 12.87 లక్షల జరిమానాను వసూలు చేశారు. 287 ఎఫ్ఐఆర్, 665 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులున్నట్లు పోలీసులు తెలిపారు. 18 సైబర్ క్రైం కేసుల్లో బాధితులకు రూ. 3.71 లక్షలు అందజేశామన్నారు. అత్యధిక కేసులను పరిష్కరించటానికి కృషి చేసిన పోలీసులను జిల్లా ఎస్పీ గౌష్ ఆలం అభినందించారు.

ఉపాధ్యాయుల నిరసన

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : సర్దుబాటు ఉత్తర్వులు మార్చాలని ఎస్‌టీయూ పిలుపుమేరకు ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి శనివారం విధులకు హాజరయ్యారు. తిర్పెల్లిలోని ఉన్నత పాఠశాల ఆవరణలో మధ్యాహ్నభోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. రవీంద్ర, శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: రాష్ట్ర గురుకులాల విద్య జేఏసీ పిలుపు మేరకు ఇంద్రవెల్లి మండలం ముత్నూరులోని గిరిజన బాలికల గురుకులంలో ఉపాధ్యాయులు చాక్‌డౌన్, పెన్‌డౌన్ ఉద్యమాన్ని చేపట్టారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీప్రియా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: ఇచ్చోడలోని బాలికల గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది నిరసన తెలిపారు. ప్రిన్సిపల్ రోజారాణి, ట్రైటా జాయింట్ సెక్రెటరీ కృష్ణవేణి, అధ్యాపకులు అశ్విని, గీతాంజలి, స్వప్న, ఉన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న టీఎస్‌యూటీఎఫ్ బాధ్యులు

హేతుబద్ధీకరణ ఉత్తర్వులు సవరించాల్సిందే

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : అసమంజసమైన హేతుబద్ధీకరణ ఉత్తర్వులు సవరించాల్సిందేనని, సర్దుబాటుకు ముందు ఎస్జీటీలను రిలీవ్ చేయాలని కోరుతూ టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆందోళనబాట పట్టారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ ఎదుట ఆయా డిమాండ్లను ప్రస్తావిస్తూ నినాదాలు చేశారు. అనంతరం ఏవో రాంరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర కార్యదర్శి వెంకట్, జిల్లా అధ్యక్షులు ఎ.స్వామి, రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష్మణ్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు టి.సూర్యకుమార్, సురేఖ, కోశాధికారి కిష్టన్న, జిల్లా కార్యదర్శులు కె.శ్రీనివాస్, గౌస్ మొహిద్దిన్, గణేష్, జిల్లా, మండల బాధ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సంఘ నిధుల వినియోగంపై సమీక్ష

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే: 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, పనుల ప్రగతిపై పాలనాధికారి రాజర్షిషా కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఆయా పనుల్లో వేగం పెంచాలని సూచించారు. జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ రవీందర్‌రాథోడ్, పీఆర్ ఈఈ శివరాం, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

గుండెను రక్షించుకుంటేనే జీవితం

ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే : శరీరంలో ఏ అవయవం పని చేయకున్నా కొన్నాళ్లు బతకొచ్చు.. గుండె పని చేయటం మానేస్తే మాత్రం జీవితం అంతం అయిపోతుంది. అందుకు గుండెను ఆరోగ్యంగా కాపాడుకోవాల్సిన అవసరం ఉందని డీఎంహెచ్‌ఓ కృష్ణ పేర్కొన్నారు. ఆదివారం 'ప్రపంచ హృదయ దినోత్సవం'ను పురస్కరించుకొని డీఎంహెచ్‌ఓ కార్యాలయంతో పాటు జిల్లాలోని 27 పీహెచ్‌సీలు, 126 ఆరోగ్య ఉప కేంద్రాల్లో శనివారం గుండెను కాపాడుకోవటానికి తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యాలయంలోని సిబ్బందికి రక్తపోటు, మధుమేహం నిర్ధారణ పరీక్షలు చేయించారు. డీఎంహెచ్‌ఓ సైతం ఆ పరీక్షలు చేయించుకున్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సాధన, ఎన్‌సీడీ అధికారి ఎం.శ్రీధర్, అదనపు డీఎంహెచ్‌ఓ గజానన్, ఎన్‌హెచ్‌ఎం కార్యక్రమ అధికారి అనిల్‌కుమార్, జిల్లా ఎపిడమాలజిస్ట్ అశోక్, గణాంకాధికారి బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మధుమేహం పరీక్ష చేయించుకుంటున్న డీఎంహెచ్‌ఓ కృష్ణ

క్రీడాపోటీల్లో 'గిరి' విద్యార్థుల ప్రతిభ

ఉట్నూరు, న్యూస్‌టుడే : ఉట్నూరు కుమురం భీం మైదానంలో జరిగిన జోనల్ స్థాయి క్రీడా పోటీలలో ఆదర్శ క్రీడా పాఠశాలకు చెందిన 30 మంది గిరిజన క్రీడాకారులు అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల పీడీ హేమంత్ తెలిపారు. ఐటీడీఏ ఇన్‌ఛార్జి డీడీ జాదవ్ వసంత్‌రావు, క్రీడాధికారి పార్థసారథి, హెచ్‌ఎం రాథోడ్ ఉత్తం విద్యార్థులను అభినందించారు.

ఇచ్చోడలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక

ఇచ్చోడ, న్యూస్‌టుడే : ఇచ్చోడలోని రైతు వేదికలో శనివారం 2023-24 ఆర్థిక సంవత్సరం ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. మొత్తం రూ. 4.48 కోట్లు ఖర్చు చేశారు. సామాజిక తనిఖీ బృందం సభ్యులు మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన పనుల వివరాలను వెల్లడించారు. పలు పంచాయతీల్లో ఎంబీలపై అధికారుల సంతకాలు లేకుండా బిల్లులు తీసుకున్నట్లు, కూలీల సంతకాలు లేవని, పనులు చేపట్టకుండా బిల్లులు చేసుకున్నట్లు తేలిందన్నారు. మొక్కలు నాటకుండా నాటినట్లు రికార్డులు సృష్టించారని బృందం సభ్యులు వెల్లడించారు. అదనపు డీఆర్‌డీఓ కుటుంబరావు సిబ్బంది తీరుపై మండిపడ్డారు. చర్యలు చేపడితేనే ఇలాంటి ఘటనలు పునరావృతం కావని హెచ్చరించారు. పలువురు సిబ్బందికి జరిమానా విధించారు. ఏపీడీ కృష్ణారావు, ఎంపీడీఓ లక్ష్మణ్, ఏపీఓ నరేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ప్రణాళికతో ప్రయత్నిస్తే విజయం మీదే

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : పకడ్బందీ ప్రణాళికకు తోడు నిరంతర ప్రయత్నం చేస్తే విజయం సొంతమవుతుందని నిజామాబాద్ జిల్లా ట్రైనీ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ పేర్కొన్నారు. సివిల్ సర్వీసులు- ప్రణాళిక సన్నద్ధత అంశంపై జరిగిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ప్రిన్సిపల్ డా. జె.సంగీత మాట్లాడుతూ విద్యార్థులకు ప్రేరణ కలిగించేలా జాతీయస్థాయిలో 35వ ర్యాంకు సాధించిన ఐఏఎస్‌ను పిలిపించినట్లు తెలిపారు. ఆయన్ను సన్మానించారు. అధ్యాపకులు జగ్‌రాం, అరుణ్, సంతోష్, చక్రవర్తి, రవికిరణ్, అశ్రఫ్, శ్రీధర, శ్రావణి, మంజుల, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్, సలేహా విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యువ ఐఏఎస్ అధికారి అజ్మీరా సంకేత్‌కుమార్

ఉట్నూరు గ్రామీణం: ఉట్నూరు ఐటీడీఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉద్యాన నర్సరీని శనివారం సంకేత్‌కుమార్ సందర్శించారు. కొనసాగుతున్న పలు కార్యక్రమాలు, రైతులకు అందిస్తున్న మొక్కల తీరుపై ఉద్యాన అధికారి సందీప్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. హెచ్‌ఓ సుధీర్‌కుమార్, బీఎడ్ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్, నర్సరీ టెక్నికల్ అసిస్టెంట్ అర్షిత తదితరులు పాల్గొన్నారు.

పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే

ఇచ్చోడ(నేరడిగొండ), న్యూస్‌టుడే : పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే అని, విద్యార్థులు పట్టుదలతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం నేరడిగొండ మండలం కుంటాల బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. సౌర కంచెను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

కొత్త ఆక్రమణల నివారణకే సర్వే

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : ఖానాపూర్ చెరువు ఆక్రమణకు గురైందనే సమాచారం మేరకు నాలుగు బృందాలతో సర్వే చేయిస్తున్నామని ఆదిలాబాద్ ఆర్డీఓ వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. శనివారం ఆయన మీడియాకు వీడియో సందేశాన్ని విడుదల చేశారు. కొత్త ఆక్రమణల నివారణ కోసం చెరువు సమీపంలోని ఇళ్లకు నెంబర్లు వేస్తున్నట్లు తెలిపారు. ఇండ్లను కూల్చే ఉద్దేశం ఎంతమాత్రం లేదని పేర్కొన్నారు.

జిల్లా న్యాయమూర్తిని కలిసిన అదనపు పీపీలు

ఎదులాపురం, న్యూస్‌టుడే : ఇటీవల అదనపు పీపీలుగా నియమితులైన సంజయ్ వైరాగరే, మేకల మధుకర్‌లు శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మొదటి అదనపు జిల్లా కోర్టుకు సంజయ్ వైరాగరే, మూడో అదనపు జిల్లా కోర్టుకు మేకల మధుకర్ అదనపు పీపీలుగా నియమితులయ్యారు. న్యాయమూర్తులు పి. శివరాంప్రసాద్, ప్రమీలా జైన్ ఉన్నారు.

అర్హులైన ఖైదీలకు ఉచిత న్యాయం

ఎదులాపురం, న్యూస్‌టుడే : వివిధ కేసుల్లో శిక్షలు అనుభవిస్తున్న, రిమాండ్‌లో ఉన్న ఖైదీలకు లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ద్వారా ఉచిత న్యాయం అందించటానికి సిద్ధంగా ఉన్నామని, అవసరమైన వారు సంప్రదించవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు సూచించారు. శనివారం ఆయన లీగల్ ఎయిడ్ కౌన్సిల్ న్యాయవాది అరుగుల అశోక్‌తో కలిసి జిల్లా జైలును సందర్శించి పరిశీలించారు. జైలు పర్యవేక్షకుడు అశోక్‌కుమార్, జైలర్ సూర్యప్రకాష్‌రెడ్డి తదితరులున్నారు.

జిల్లాకు చేరిన మాదిగల మేలుకొలుపు యాత్ర

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : ఎస్సీ వర్గీకరణను జిల్లాల వారీగా చేపట్టి 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్, మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డా.పిడమర్తి రవి డిమాండ్ చేశారు. మాదిగల మేలుకొలుపు యాత్రలో భాగంగా శనివారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన బస్టాండ్ ఎదుట అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా మేలుకొలుపు యాత్ర చేపట్టామన్నారు. మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్, నాయకులు నక్క రాందాస్, చందాల రాజన్న, సోమ చంద్రశేఖర్, సురేష్, జోగు గణేష్, తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డా.పిడమర్తి రవి, నాయకులు

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని వైద్యురాలు హరిప్రియ అన్నారు. నర్సాపూర్(బి) గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో ఆర్‌బీఎస్ వైద్యురాలు, సిబ్బంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

30న జిల్లాస్థాయి అండర్-14 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రం దస్నాపూర్ కాలనీలోని సూపర్ టీ20 క్రీడా మైదానంలో ఈ నెల 30న అండర్-14 బాలుర జిల్లాస్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సీహెచ్.కాంతారావు తెలిపారు. వివరాలకు 77020 35200 నెంబరును సంప్రదించాలన్నారు.

భాజపా సభ్యత్వ నమోదు

జైనథ్, న్యూస్‌టుడే : జైనథ్‌లో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్ శనివారం ప్రారంభించారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రమేష్‌రెడ్డి, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు సుభాష్, అసెంబ్లీ కన్వీనర్ విజయ్, మండల అధ్యక్షుడు రాందాస్, యువ మోర్చా మండల అధ్యక్షుడు రాకేష్‌రెడ్డి, గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు సిడాం రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

గుంతల పూడ్చివేత

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : ఉట్నూరు మండలం ఎక్స్‌రోడ్ నుంచి హస్నాపూర్ ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను హస్నాపూర్‌వాసులు పూడ్చారు. గతంలో ఈ గుంతల్లో పలువురు పడి మృతి చెందగా కొంత మంది గాయాలపాలయ్యారు. శనివారం అజయ్, యువరాజ్, సుభాష్, శంకర్ శ్రమదానం చేసి గుంతలు పూడ్చారు.

ఎస్ఐగా బాధ్యతల స్వీకరణ

ఆదిలాబాద్ నేర విభాగం, ఇచ్చోడ, న్యూస్‌టుడే: ఇచ్చోడ పీఎస్ ఎస్ఐగా ఏ.తిరుపతి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు ఇచ్చోడ ఎస్ఐగా విధులు నిర్వర్తించిన జి.నరేష్‌ను పలు ఆరోపణల్లో ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో ప్రస్తుతం ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన తిరుపతి మంచిర్యాల జిల్లా దండేపల్లికి చెందిన వారు. 18 సంవత్సరాలు ఆర్మీలో సేవలందించి 2020 బ్యాచ్ ఎస్ఐగా ఎంపికై నిర్మల్, ముథోల్, జగిత్యాల జిల్లాలోని సారంగాపూర్, జగిత్యాల పీఎస్‌లలో పని చేశారు. ఎస్పీ గౌష్ ఆలంను కలిసి మొక్కను అందజేశారు.

పట్టణాభివృద్ధికి అవసరమైన నిధులు: ఎమ్మెల్యే

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : పట్టణాభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకొస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. వాల్మీకినగర్‌లో అమృత్ పథకంతో నిర్మించనున్న 10 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన మంచినీటిట్యాంకు పనులు ప్రారంభించారు. కమిషనరు ఖమర్ అహ్మద్, నాయకులు లాలామున్నా, ప్రవీణ్, రవి, దయాకర్, భూమారెడ్డి, రాజు, రఘుపతి, భరత్, రాము, కృష్ణారెడ్డి, ముకుంద్ పాల్గొన్నారు.

ఖానాపూర్ చెరువు పరిధిలో సర్వేపై చర్చ

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ పట్టణానికి ఆనుకుని విస్తరించిన ఖానాపూర్ చెరువు పరిధిలో బల్దియా, నీటిపారుదల, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా చేపట్టిన సర్వేపై బల్దియా సర్వసభ్య సమావేశంలో చర్చించారు. శనివారం ఛైర్మన్ జోగు ప్రేమేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు కౌన్సిలర్లు ఖానాపూర్ కాలనీవాసులు మూడురోజులుగా ఆందోళన చెందుతున్న విషయాన్ని ప్రస్తావించారు. నివాస గృహాలకు మార్కింగ్ చేస్తుండటంతో ఎక్కడ కూల్చివేస్తారోనని భయపడుతున్నారని పేర్కొన్నారు. పురపాలక అధ్యక్షుడు జోగు ప్రేమేందర్ మాట్లాడుతూ సర్వే విషయమై కౌన్సిలర్లందరు కలిసి జిల్లా కలెక్టర్‌ను కలుద్దామని పేర్కొన్నారు. ఏళ్లుగా అక్కడ నివాసమున్న వారికి ముందుగా ప్రత్యామ్నాయం చూపించి సర్వే చేయాలని కోరదామన్నారు. అనంతరం ఎజెండాలోని అంశాలను ఆమోదిస్తున్నట్లు పేర్కొన్నారు. బల్దియా కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్, డీఈఈ తిరుపతి, భారాస కౌన్సిలర్లు అలాల్ అజయ్, పవన్ నాయక్, వెనుగంటి ప్రకాశ్, సత్యనారాయణ, కాంగ్రెస్ కౌన్సిలర్లు జహీర్ రంజానీ, బండారి సతీష్, కలాల శ్రీనివాస్, చంద నర్సింగ్, లక్ష్మణ్, భాజపా కౌన్సిలర్లు ఆకుల ప్రవీణ్, కృష్ణ యాదవ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బల్దియా అధ్యక్షుడు జోగు ప్రేమేందర్, చిత్రంలో కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్, డీఈఈ తిరుపతి



బతుకమ్మలతో డైట్ ఛాత్రోపాధ్యాయినులు, అధ్యాపకులు

ముందస్తు బతుకమ్మ సంబరాలు

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : డైట్ కళాశాలలో శనివారం ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఛాత్రోపాధ్యాయినులు బతుకమ్మ ఆడి సందడి చేశారు. మరో రెండు రోజులు గడిస్తే దసరా సెలవులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో సంబరాలు చేసుకున్నారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డా. కోల కిరణ్, అధ్యాపకులు స్వర్ణకుమారి, విజయలక్ష్మి, విజయరావు, ఉమాకాంత్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

యువజనోత్సవాల విజేతలు వీరే

ఆదిలాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : ఇటీవల జిల్లా కేంద్రంలోని జడ్పీ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి యువజనోత్సవాలు పోటీలు జరిగాయి. ఆయా విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతల జాబితాను జిల్లా యువజన క్రీడల అధికారి వేంకటేశ్వర్లు శనివారం వెల్లడించారు. జానపద నృత్య బృందం పోటీల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్ అండ్ కామర్స్ ఆదిలాబాద్, సోలో విభాగంలో రాజ్యశ్రీ(ప్రభుత్వ డైట్ కళాశాల ఆదిలాబాద్), జానపద పాటల్లో ప్రవీణ్ బృందం(ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆదిలాబాద్), సోలో విభాగంలో జాగృతి, కథా రచనలో ఎం.శ్రీలత, ఉపన్యాస పోటీల్లో ఆర్.వైష్ణవి, కవిత్వంలో సానియా, నేపథ్యం పోటీల్లో జె.హర్ధిక-వైష్ణవి(ప్రభుత్వ వ్యవసాయ కళాశాల ఆదిలాబాద్), చిత్రలేఖనంలో గంధం శ్రీలత(ఆదిలాబాద్), హస్తకళ/వ్యవసాయ ఉత్పత్తులు ప్రదర్శనలో కోవ చంపాబాయి(చిట్టలబోరి, ఆదిలాబాద్ (గ్రామీణం) ప్రథమ స్థానాల్లో నిలిచారు. వీరు హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు.

వర్షం నీటిని ఒడిసి పట్టే పనులకే ప్రాధాన్యం

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : వర్షం నీటి నిల్వ పనులకు ప్రాధాన్యమిస్తామని ఏకలవ్య ఫౌండేషన్ ఛైర్మన్ వెంకట్‌రావు అన్నారు. శనివారం ఇంద్రవెల్లి మండలంలోని వాల్గొండ పంచాయతీ కేంద్రంలో పర్యటించారు. ఫౌండేషన్ ద్వారా నిర్మించిన చెక్‌డ్యాం పనులను పరిశీలించారు. సీఈఓ మధుకర్, మాజీ సర్పంచి జూగాదిరావు, ట్రస్ట్ సభ్యులు దిగంబరు, గ్రామ పటేల్ లచ్చు, రైతులు పాల్గొన్నారు.

అటవీ సిబ్బందికి రక్షణ కల్పించాలి

ఎదులాపురం, న్యూస్‌టుడే : అటవీ క్షేత్రస్థాయి అధికారుల రక్షణకు ఏర్పాటు చేయాలని కోరుతూ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. తాడ్వాయిలో అటవీ అధికారులపై దాడి ఘటన నేపథ్యంలో కలెక్టర్‌తో పాటు డీఎఫ్‌ఓను కలిశారు.